సాక్షి నంద్యాల
సోమవారం, 19, జూన్, 2023



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



1.1 టీఎంసీల నీరు నిల్వ

గూడూరు: సుంకేసుల డ్యాంలో 1.152 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కర్నూలువాసుల తాగునీటి అవసరాల నిమిత్తం ఆదివారం కేసీ కాల్వకు 104 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.



శ్రీ మఠంలో భక్తుల రద్దీ

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో ఆదివారం అమావాస్య పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

బియ్యం దందా.. పోలీసుల అండ

- జిల్లాలో యథేచ్ఛగా రేషన్ బియ్యం అక్రమ రవాణా
- సిండికేట్ ముఠాగా ఏర్పడిన వ్యాపారులు
- మామూళ్లతో పోలీసుల కళ్లకు గంతలు
- బియ్యం డాన్‌గా ఎదిగిన బనగానపల్లె వ్యాపారి

బొమ్మలసత్రం: పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యం యథేచ్ఛగా జిల్లా సరిహద్దులు దాటుతోంది. బియ్యం దందాను అడ్డుకోవాల్సిన పోలీసులే వ్యాపారులకు రెడ్ కార్పెట్ వేసి వాహనాలను దారి మళ్లిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. జిల్లా నుంచి ప్రతి నెలా వందల టన్నుల బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నా అడ్డుకునే వారు కరువయ్యారు. చిన్న చిన్న వ్యాపారుల ద్వారా సేకరించిన బియ్యాన్ని బడా వ్యాపారులు ఒక చోటుకు తరలించి అక్కడి నుంచి కర్ణాటక, తెలంగాణ ప్రాంతాలకు యథేచ్ఛగా సరిహద్దులు దాటిస్తున్నారు. వ్యాపారులంతా సిండికేట్‌గా మారి రూ. కోట్లు గడిస్తున్నారు. బనగానపల్లెకు చెందిన ఓ బియ్యం వ్యాపారి రేషన్ డాన్‌గా ఎదిగి ఈ సిండికేట్ ముఠాను శాసిస్తున్నట్లు తెలుస్తోంది. బనగానపల్లె కేంద్రంగా ప్రతి నెల 500 టన్నులకు పైగా రేషన్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించడం వెనుక పోలీసుల సహకారం ఉన్నట్లు తెలుస్తోంది. బియ్యం డాన్ గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే సహకారంతో రూ. కోట్లకు పడగలెత్తాడు. ఇదే దందాను ఇప్పటికే అలాగే కొనసాగిస్తున్నాడు. కింది స్థాయి పోలీసులకు మామూళ్లు ఇచ్చి బియ్యం తరలించే వాహనాలు పట్టుబడకుండా చూసుకుంటున్నాడు. జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా కొందరి అవినీతి సిబ్బంది కారణంగా సత్ఫలితాలు కనిపించడం లేదు. బియ్యం డాన్ ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి పొలాల మధ్య డంప్ చేసి రాత్రికి రాత్రి జిల్లా దాటిస్తున్నాడు.



నంద్యాలలో బొరుగుల బట్టీలో నిల్వ ఉంచి రేషన్ బియ్యం బస్తాలు (ఫైల్)



నంద్యాలలో విజిలెన్స్ అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం లారీ (ఫైల్)

సిండికేట్‌లదే హవా...

నంద్యాల జిల్లా కేంద్రంలో 10 మందికి పైగా వ్యాపారులు ఒక సిండికేట్‌గా ఏర్పడి రేషన్ బియ్యం కొనుగోలుకు పెట్టుబడులు పెట్టి దందా కొనసాగిస్తున్నారు. ఇందులో సమాజంలో పలుకుబడి కలిగిన ఓ వ్యక్తి పోలీస్ శాఖలోని కీలక అధికారితో చేతులు కలిపి వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం. సిండికేట్‌లు ప్రతి నెల ఆయా స్టేషన్ పరిధిలోని సిబ్బంది చేతులు తడుపుతుండటంతో రేషన్ బియ్యం వాహనాలు ఎదురుగా వెళ్తున్నా పట్టించుకోవటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే జిల్లా ఉన్నతాధికారులు మాత్రం గతంలో తాము రేషన్ బియ్యం ముఠాలపై కట్టడి చేయటం వల్లే కేసులు తగ్గాయని భావిస్తున్నారు. ఇక్కడ మాత్రం అందుకు విరుద్ధంగా కింది స్థాయి సిబ్బంది బియ్యం వ్యాపారులతో చేతులు కలిపి దాడులు చేయటమే మానేసినట్లు తేటతెల్లమవుతోంది. ఒక లారీ రేషన్ బియ్యం అనుకున్న గమ్యానికి చేరవేస్తే రూ.1 లక్షకు పైగా ఆదాయం వస్తుంది. ఇలా ప్రతి నెల దాదాపు 50 లారీలకు పైగా బియ్యాన్ని జిల్లా కేంద్రం నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారంటే సిండికేట్ల ఆదాయం ఏ స్థాయిలో ఉంటుందో అంచనా వేయవచ్చు.

లిక్కర్ ఫ్యాక్టరీకి కొంత.. రీ సైక్లింగ్‌కు మరి కొంత..

పేదలకు పంపిణీ చేసిన రేషన్ బియ్యం అక్రమంగా కొంత లిక్కర్ ఫ్యాక్టరీకి, మరి కొంత రీ సైక్లింగ్‌కు తరలుతున్నట్లు తెలుస్తోంది. నంద్యాల పట్టణ శివారులోని ఓ ఆల్కహాల్ తయారు చేసే ఫ్యాక్టరీ యాజమాన్యం గతంలో ఇతర ప్రాంతాల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి లిక్కర్ తయారు చేసేవారు. అయితే సుదూర ప్రాంతాల నుంచి బియ్యం రవాణా చేసేందుకు ఎక్కువ మొత్తం ఖర్చు చేయాల్సి వచ్చేది. అయితే కొంత కాలం నుంచి జిల్లా కేంద్రంలో రేషన్ సిండికేట్ వ్యాపారులతో చేతులు కలిపి బియ్యాన్ని సరఫరా చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో సిండికేట్‌లు ప్రజల నుంచి ఒక కేజీ రేషన్ బియ్యం రూ. 12కు కొనుగోలు చేసి రూ. 21కి ఫ్యాక్టరీకి చేరవేస్తున్నారు. ప్రతి నెల దాదాపుగా వందల టన్నుల రేషన్ బియ్యం లిక్కర్ ఫ్యాక్టరీకి చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక విజయ డెయిరీ సమీపంలోని ఓ బొరుగుల బట్టీ యజమాని అక్రమంగా బియ్యం నిల్వ చేసి ఆల్కహాల్ ఫ్యాక్టరీకి తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం ఉన్నా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఎస్‌బీఐ కాలనీలో మరో వ్యాపారి ప్రతి నెల 15 టన్నులు పైగా బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నా అడ్డుకోలేక పోతున్నారు. జిల్లాలోని వెలుగోడు, ఆత్మకూరు, బనగానపల్లె, డోన్ ప్రాంతాల్లో రేషన్ బియ్యం వ్యాపారులు బెంగళూరు ప్రాంతాలకు యథేచ్ఛగా వందల టన్నుల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. ఈ బియాన్ని రీ సైక్లింగ్ చేసి సన్న బియ్యంగా మార్చి విక్రయిస్తున్నట్లు సమాచారం.



అయ్యలూరు సమీపంలోని ముళ్లపొదల్లో దాచిన బియ్యం బస్తాలు



నంద్యాల వన్‌టౌన్ పోలీసులు పట్టుకుని వదిలేసిన రేషన్ బియ్యంతో ఉన్న లారీ (ఫైల్)

పోలీసుల సహకారానికి నిదర్శనాలు..

- ఈ ఏడాది జనవరి నెలలో నంద్యాల వన్‌టౌన్ పోలీసులు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. అయితే ఉదయానికి స్టేషన్‌లో లారీ కనిపించకుండా పోయింది. సిండికేట్ సభ్యుల్లో ఒకరు చక్రం తిప్పడంతో పోలీసులు రాత్రికి రాత్రి లారీ వదిలేశారనే విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వారం రోజుల తర్వాత పోలీస్ ఉన్నతాధికారులకు విషయం తెలియడంతో సంఘటనపై విచారణ జరిపినా ఒక్కరిపై కూడా చర్యలు తీసుకోలేదు.
- జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు దాడులు చేసి బియ్యం, వాహనాలను సీజ్ చేస్తున్నారు. కానీ స్థానిక పోలీసులకు మాత్రం ఎందుకు సమాచారం అందడం లేదనేది మిలియన్ బస్తాల ప్రశ్నగా మిగిలిపోతుంది.
- జిల్లాలో ఎక్కువగా బనగానపల్లె, డోన్, వెలుగోడు ప్రాంతాల్లో రేషన్ బియ్యం అక్రమ నిల్వలు బయటపడినా వాహనదారులు, చిన్న చిన్న వ్యాపారులను అరెస్ట్ చూపుతున్నారే కాని బడా వ్యాపారులను అరెస్ట్ చేయడంలో పోలీసులు తాత్సారం చేయడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రేషన్ దందా ముఠాలకు సహకరిస్తే వేటు తప్పదు



అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ముఠా సభ్యులకు ఎవరైనా పోలీసులు సహకరించారని తెలిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయి. జిల్లాలో గత కొంత కాలంగా రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాం. ఎవరైనా అక్రమ రేషన్ బియ్యం తరలించినా, వారికి సహకరించినా అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– రఘువీర్‌రెడ్డి, జిల్లా ఎస్పీ, నంద్యాల

న్యూస్‌రీల్

అధిక ఫీజు వసూళ్లపై విచారణ

సాక్షి ఎఫెక్ట్

జూపాడుబంగ్లా: 'సాక్షి' దినపత్రికలో ఈనెల 17న 'చదువుకొనాల్సిందే' శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని నందికొట్కూరు, పగిడ్యాల, మిడ్తూరు, పాములపాడు, కొత్తపల్లి మండలాల ఎంఈఓ కార్యాలయాలకు ఫోన్‌చేసి సత్వరమే ప్రైవేటు పాఠశాలల్లో వసూళ్లు చేస్తున్న ఫీజు వివరాలు, పుస్తకాల విక్రయ ధరలు తెలియజేస్తూ పాఠశాలల వారీగా నివేదికలు పంపించాలని ఆదేశించారు. ఈ మేరకు ఆయా మండలాల ఎంఈఓ కార్యాలయాల సిబ్బంది వివరాలు సేకరించి అధికారులకు నివేదించారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించే స్కూళ్లపై చర్యలు తప్పవని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

నేడు స్పందన కార్యక్రమం

నంద్యాల: స్థానిక వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ హాజరు కావాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయిల్లో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు.

శ్రీగిరికి పోటెత్తిన భక్తజనం



క్యూలైన్లలో భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. వేకువజామున్నే పాతాళగంగలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, మల్లన్న దర్శనానికి బారులుదీరారు. ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర దర్శన క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వేకువజాము నుంచే భక్తులను మల్లన్న దర్శనానికి అనుమతించారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు మంచినీరు, అల్పాహారం, బిస్కెట్లను పంపిణీ చేశారు. భక్తులందరికీ త్వరితగతిన సౌకర్యవంతమైన స్వామివారి దర్శనాన్ని దేవస్థాన అధికారులు కల్పిస్తున్నారు.

హార్డ్‌వేర్, ఐటీపై ఉచిత శిక్షణ

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 26 నుంచి కంప్యూటర్ హార్డ్‌వేర్, ఐటీ, టెలీకాలర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శశికళ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్ ఆపై చదివిన విద్యార్థులు అర్హులని, కోర్సు పూర్తి చేసిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపుతో కూడిన సర్టిఫికెట్ ఇస్తామన్నారు. ఆయా కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రతాపరెడ్డి తెలిపారన్నారు. శిక్షణకు అర్హులైన యువత ఈనెల 24వ తేదీలోగా కళాశాలలో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. వివరాలకు 8297812530, 8498070087 సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.



సాక్షి మీడియా, ఆర్‌సీ ఎగ్జామ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలులోని ఓ ఫంక్షన్ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలకు ఎలా సన్నద్ధత కావాలో అధ్యాపకులు వివరించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువతీ, యువకులు స్కాలర్‌షిప్ టెస్టు రాశారు.

– వివరాలు II లో ▸

కారుణ్య నియామకాలపై నేడు సమావేశం

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజా రవాణా శాఖలో కారుణ్య నియామకాలపై సోమవారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఆ శాఖ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించి అన్ని జిల్లాల పర్సనల్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్లతో సమీక్షించనున్నారు. జిల్లా వారీగా ఉన్న ఖాళీ ఉద్యోగాలు, కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల, ఇప్పటి వరకు భర్తీ చేసిన ఉద్యోగాల వివరాలను అడిగి తెలుసుకొని, మిగిలిన వారికి ఉద్యోగాలు ఇచ్చే అంశంపై చర్చించనున్నట్లు సమాచారం.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మెరిశారు!

- ఫలితాల్లో సత్తా చాటిన ఉమ్మడి జిల్లా విద్యార్థులు

కర్నూలు సిటీ/నంద్యాల(న్యూటౌన్): ఐఐటీల్లో విద్యను అభ్యసించేందుకు నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. జిల్లాకు చెందిన ఎస్.తరుణ్ 46వ ర్యాంకు, కె.రాఘవేంద్ర రెడ్డి క్యాటగిరిలో 98వ ర్యాంకు, డా.బిఆర్ అంబేడ్కర్ గురుకుల ఐఐటీ మెడికల్ అకాడమీ(చిన్నటేకూరు, కల్లూరు మండలం)కి చెందిన కిరణ్‌కుమార్ క్యాటగిరీ విభాగంలో 616వ ర్యాంకు సాధించారు. వీరితో పాటు అనుగ్య 711, సూర్యతేజ 869, ఎ.వినయ 1,109, పవన్ కుమార్ రెడ్డి 1,519, జె.అక్షయ రావు ఆల్ ఇండియా లెవెల్‌లో 2,887వ ర్యాంకు సాధించారు. ఈ నెల 4వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్–1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్–2 పరీక్షలు నిర్వహించగా ఉమ్మడి జిల్లా నుంచి 450 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాలను ఆదివారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసింది.

గురుకుల విద్యార్థుల సత్తా

జేఈఈ అడ్వాన్స్‌డ్ కల్లూరు మండలం చిన్నటేకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఐఐటీ మెడికల్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటినట్లు ఆ అకాడమీ డైరెక్టర్ డి.రామసుబ్బారెడ్డి తెలిపారు. ఆల్ ఇండియా లెవెల్‌లో కిరణ్‌కుమార్ క్యాటగిరీలో 616వ ర్యాంకు, దుంగావత్ గౌతమ్ నాయక్ 1,374, శక్తి కృపారావు 1,398, నడిమింటి రఘురాం 1,758వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. జంగం విద్యాసాగర్ 1983, చిన్నలింగప్పగారి ప్రవీణ్ 2289, కె.చాంద్ 2932, పరంపాగు సందీప్ 3265, మల్లెపోగు అవన్‌కుమార్ 3967వ ర్యాంకు సాధించారన్నారు.



విద్యార్థి: ఎస్.కృపారావు
తల్లిదండ్రులు: పరుశరాం, జయమ్మ
స్వస్థలం: శ్రీకాకుళం
జేఈఈ ర్యాంకు: 1,398(క్యాటగిరీ)
లక్ష్యం: ఐఏఎస్ కావడం



విద్యార్థి: సంజీవ్ వర్ధన్
తల్లిదండ్రులు: సంజీవ రాయుడు, భారతి
స్వస్థలం: నంద్యాల, జ్ఞానాపురం
జేఈఈ ర్యాంకు: 2,179
లక్ష్యం: ఐపీఎస్ కావడం



విద్యార్థి: ప్రిన్స్ బ్రహ్మంరెడ్డి
తల్లిదండ్రులు: మహేశ్వరరెడ్డి, నాగేశ్వరమ్మ
స్వస్థలం: నంద్యాల, హౌసింగ్ బోర్డు కాలనీ
జేఈఈ ర్యాంకు: 97
లక్ష్యం: కంప్యూటర్ సైన్స్ ఇంజినీర్ కావడం



విద్యార్థి: హర్షవర్ధన్
తల్లిదండ్రులు: రవిశంకర్, శ్రీలక్ష్మి
స్వస్థలం: డోన్
జేఈఈ ర్యాంకు: 263
లక్ష్యం: సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావడం



విద్యార్థి: రఘురాం
తల్లిదండ్రులు: శ్రీరాములు, జయమణి
స్వస్థలం: కర్నూలు, వెంకన్నబావి
జేఈఈ ర్యాంకు: 1,758 (క్యాటగిరీ)
లక్ష్యం: స్టాఫ్‌వేర్ ఇంజినీర్ కావడం

ఉద్యాన రైతుకు 'ఉపాధి' బాట

- పండ్ల తోటల రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం
- ఉపాధి హామీ పథకం కింద రాయితీ మంజూరు
- మొక్కలు సరఫరా, సంరక్షణకు నిధులు
- ఈనెల 22 వరకు దరఖాస్తుకు గడువు



మర్రిపల్లిలో ఉపాధి హామీ పథకంలో నాటిన నిమ్మతోట

ఆళ్లగడ్డ: ఉద్యాన పంటల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఐదు ఎకరాల్లోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులు ఆర్థికంగా బలోపేతమయ్యేలా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటలు సాగు చేయడంపై కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి నిధులు, లక్ష్యాలను నిర్దేశించింది. జిల్లాలో పండ్ల తోటల సాగు పెంచి చిన్న, సన్నకారు రైతులకు బాసటగా నిలిచేందుకు ప్రయత్నిస్తోంది. 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ ద్వారా జిల్లాలో 5 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేయించాలని అధికారులు నిర్దేశించారు. ఈ నెల 22 తేదీ వరకు గడువు ఉండగా ఇప్పటికీ సుమారు 1,451 మంది రైతులకు సంబంధించిన 3,569 ఎకరాలు పండ్ల తోటల సాగుకు గుర్తించారు. ఆయా పొలాల్లో ఈ నెల 19వ తేదీ నుంచి పండ్ల మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు ఉన్న కుటుంబానికి 5 ఎకరాల్లోపు పొలం ఉండాలి. మొక్కల కొనుగోలు, గుంతల తవ్వకం, డ్రిప్ పరికరాల ఏర్పాటు, భూమిని చదును చేసేందుకు ట్రాక్టర్ బాడుగ, ఎరువులు, క్రిమిసంహారక మందులు అంతర్‌పంటల సాగు, నీటి తడులతో పాటు పొలానికి కాపలాకు ఇలా ప్రతి దానికి ప్రభుత్వమే రైతుకు డబ్బు చెల్లిస్తోంది. ఇలా మూడు సంవత్సరాల పాటు ఉపాధి హామీ ద్వారా ప్రభుత్వమే పూర్తిగా ఖర్చంతా భరిస్తుంది. రైతు కేవలం తాను సాగు చేసిన పంటలను కాపాడుకోవాల్సి ఉంది. ఇలా ఏడాదికి ఎకరాకు సుమారు రూ. లక్ష మేర రైతులకు రాయితీ అందుతుంది. తొలి ఏడాదితో పాటు మూడో ఏడాది కూడా నిర్వహణకు నిధులిస్తారు. నీటి వసతి లేకపోయినా బీడు భూముల్లోనూ ఉద్యాన పంటలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహిస్తోంది. సమీపంలోని వంకలు, వాగులు, చెరువులు, కుంటలు, ఫారంపాండ్ నుంచి నీళ్లు తెచ్చి మొక్కలను బతికుంచుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో సన్న, చిన్నకారు రైతులకు వరంగా మారింది.

ఏఏ పంటలు..

చీని, మామిడి, నిమ్మ, జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, అల్లనేరేడు, చింత, ఆపిల్, డ్రాగన్ ఫ్రూట్, కొబ్బరి, చింత, యాపిల్‌బేర్, రేగుతో పాటు కొత్తగా మునగ మొక్కల ప్లాంటేషన్, మునగ మొక్కల నర్సరీలకు కూడా రాయితీ నిధులిచ్చి పోత్సహిస్తున్నారు.

రెండేళ్లలో 2.46 లక్షల రాయితీ



ఇక్కడ చీని చెట్టు కాపును సంతోషంగా చూపిస్తున్న రైతు ఆళ్లగడ్డ మండలం బాచేపల్లి గ్రామానికి చెందిన కొట్టె నాగేశ్వరరావు. ఇతను రెండేళ్ల క్రితం ఉపాధి హామీ పథకం కింద రెండెకరాల్లో 500 చీని చెట్లు నాటుకున్నాడు. ఇందుకు సంబంధించి పొలం తిప్పలో ఉండటంతో అందులో గుండ్రాళ్లు ఎత్తి పోసేందుకు రూ. 49,620, మొక్కలు తెచ్చుకునేందుకు రూ. 27,000, గుంతలు తీసి మొక్కలు నాటుకునేందుకు రూ 1.25 లక్షలు, మొదటి సంవత్సరం మందులకు రూ. 5000, సేద్యాలకు రూ. 5000, మొక్కల సంరక్షణకు రూ. 25,000లతో పాటు అంతర్ పంటలు సాగు చేసుకున్నందుకు ఎకరారకు రూ. వెయ్యి చొప్పున 5 ఎకరాలకు రెండేళ్లకు రూ. 10 వేలు క్రమం తప్పకుండా ప్రభుత్వం జమ చేసింది. 'సొంత డబ్బులు ఖర్చు పెట్టి పండ్ల మొక్కలు నాటుకునే పరిస్థితి నాకు లేదు. ప్రభుత్వ సాయం మరువలేనిది. పండ్ల తోటకు యజమానిగా నిలిచా'.

సద్వినియోగం చేసుకోవాలి

ఏటేటా ఉద్యాన పంటల సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది 5000 ఎకరాలకు పైగా తోటల సాగు చేపట్టాలని నిర్ణయించుకున్నాం. 19వ తేదీ నుంచి గుంతలు తీసే పనులు మొదలు పెట్టేలా ఏర్పాట్లు చేశాం. ఇంకా ఎవరైన దరఖాస్తు చేసుకోవాలంటే ఈ నెల 22వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– రామచంద్రారెడ్డి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ, నంద్యాల

నిర్వహణ బిల్లులు ఇలా..

ఉపాధి హామీ కింద సాగు చేసిన పండ్లతోటలకు మూడేళ్ల పాటు పనిదినాలను బట్టి నిర్వహణకు నిధులు విడుదల చేస్తారు. మొదటి సంవత్సరం నాటిన మొక్కల్లో కనీసం 50 శాతం బతికి ఉంటే ప్రతి నెల నిర్వహణ బిల్లులు ఇస్తారు. మొక్కకు రోజుకు 0.50 పైసల ప్రకారం నెలకు రూ. 15 చెల్లిస్తారు.

గడపగడపలో హర్షం



వర్షం కురుస్తున్నా గడపగడప కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. చాగలమర్రి సచివాలయం –2 పరిధిలో ఆదివారం ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. వర్షం కురుస్తున్నా ప్రతి ఇంటికెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. – చాగలమర్రి

తేనెటీగల పెంపకంతో లాభాలు



తేనెటీగల పెంపకంపై గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నంద్యాల(సెంట్రల్): తేనెటీగల పెంపకంతో గిరిజనులు మంచి లాభాలు పొందవచ్చునని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ సహాయ కమిషనర్ సోమనాథ్ పేర్కొన్నారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో నిర్వహిస్తున్న ఏడు రోజుల శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం పలు అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. తేనెటీగల పెంపకం, తేనెపట్టు మైనం, పుప్పొడి, రాజు ఆహారం, ఈగల విషం తదితర విషయాలపై విస్తృతంగా చర్చించారు. తేనె సేకరణ, విక్రయాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంయుక్త సంచాలకులు వెంకటేశ్వర్లు, శాస్త్రవేత్తలు నరసింహులు, కోర్సు సంచాలకులు మంజునాథ్, ఐటీడీఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెళ్లి రోజు జరుపుకోకుండానే..


చంద్రకళ(ఫైల్)

పగిడ్యాల: తెల్లవారితే పెళ్లి రోజు వేడుకలు జరుపుకోవాల్సిన ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పగిడ్యాలకు చెందిన గొల్ల పుల్లన్న కూతురు చంద్రకళ(23)కు ఏడాది క్రితం అల్లూరు గ్రామానికి చెందిన పాయల కృష్ణంరాజుతో వివాహమైంది. వారం రోజుల క్రితం పుట్టింటికి చేరుకుంది. భర్త కృష్ణంరాజు కూడా ఆదివారం ఉదయం వరకు ఇక్కడే ఉండి ఆ తర్వాత అల్లూరుకు వెళ్లాడు. తల్లిదండ్రులు కూడా పని మీద బయటకు వెళ్లారు. కొద్ది సేపటి తర్వాత ఇంటికొచ్చిన తల్లి దండ్రులకు కుమార్తె చంద్రకళ ఫ్యాన్‌కు ఉరేసుకుని విగతజీవిగా కనిపించింది. సోమవారం పెళ్లి రోజు వేడుక చేసుకోవాల్సిన కుమార్తె మృతి చెంది కనిపించడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కడుపునొప్పి బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి తల్లి వరలక్ష్మీ చెబుతోంది. సమాచారం మేరకు తహసీల్దార్ భారతి ఘటన స్థలానికి చేరి పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున తెలిపారు.

అడవి దాటి గ్రామంలోకి..



మహానంది: నల్లమలలో నీటివనరులు తగ్గడంతో దాహార్తి తీర్చుకునేందుకు వన్యప్రాణులు గ్రామాల వైపు వస్తున్నాయి. ఆదివారం బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామంలోకి ఓ చుక్కల దుప్పి వచ్చింది. గ్రామంలోని వచ్చిన దుప్పిని కుక్కలు వెంబడించడంతో భయపడి ఓ ఇంట్లోకి వెళ్లడంతో గ్రామస్తులు గుర్తించి రక్షించారు. వెంటనే వారు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఎఫ్ఆర్ఓ నాసిర్‌జా ఆదేశాల మేరకు సిబ్బంది రామకృష్ణ, ప్రొటెక్షన్ వాచర్లు గ్రామానికి చేరుకుని దుప్పిని ఆటోలో తీసుకెళ్లి ఓంకారం సమీపంలోని నల్లమల అడవిలో వదిలేశారు.

నేడు రెండవ విడత కౌన్సెలింగ్

డోన్ టౌన్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో మిగిలి పోయిన సీట్ల భర్తీ కోసం సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో రెండవ విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ ప్రసాద్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో సీటు దక్కని వారు మాత్రమే రెండవ విడత కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి కేటాయించిన మెరిట్‌లో 1 నుంచి 850 వరకు సోమవారం జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆయన సూచించారు.

ప్రణాళికతో చదివితే కొలువు సులువే!

- ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి త్వరలోనే భారీగా నోటిఫికేషన్స్
- ఉత్తమ శిక్షణ సంస్థలను ఎంపిక చేసుకోవాలి
- సాక్షి మీడియా గ్రూప్, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ఎం.అబ్దుల్ కరీం


స్కాలర్‌షిప్ టెస్టులో ద్వితీయ స్థానం సాధించిన వరప్రసాదుకు బహుమతి అందజేస్తున్న అధ్యాపకులు

కర్నూలు సిటీ: చక్కని ప్రణాళికతో చదివితే కోరుకున్న కొలువును సులువుగా సాధించవచ్చని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. సివిల్స్, గ్రూప్–1, గ్రూప్–2 వంటి పోటీల పరీక్షలపై నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించేందుకు సాక్షి మీడియా గ్రూప్, ఆర్‌సీ ఎగ్జామ్(హైదరాబాద్) సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలు నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సదస్సు నిర్వహించారు. సదస్సుకు నిరుద్యోగ యువతీ, యువకులు భారీ ఎత్తున హాజరయ్యారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్నటువంటి గ్రూప్–1, గ్రూప్–2 పోస్టులు వెయ్యికిపైగా భర్తీ చేసేందుకు ప్రభుత్వం త్వరలో చర్యలు తీసుకుంటోందని అధ్యాపకులు తెలిపారు. పరీక్షల విధానం, మారిన సిలబస్, విద్యార్థుల సన్నద్ధతపై అధ్యాపకులు డాక్టర్ అబ్దుల్ కరీం(హిస్టరీ), సి.హరిక్రిష్ణ, (సైన్స్ అండ్ టెక్నాలజీ), ఎం.డి పాషా(ఎకనామీ), బి.కృష్ణారెడ్డి(పాలిటీ), శంకర్ రెడ్డి(మెంటల్ ఎబిలిటీ), జల్లు సద్గుణరావు (జాగ్రఫీ) అవగాహన కల్పించారు. ముందుగా ఆర్‌సీ ఎగ్జామ్ సెంటర్ చైర్మన్ ఎం.కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ సబ్జెక్టులలో నిష్ణాతులైన లెజండరీ ఫ్యాకల్టీలతో కరోనా సమయం నుంచి ఆన్‌లైన్‌లో క్లాసులు నిర్వహించామన్నారు. ప్రస్తుతం ఆఫ్‌లైన్‌లో తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఆన్‌లైన్‌లో తమ సంస్థ ద్వారా 25 వేల మంది నిరుద్యోగులు శిక్షణ పొందారని, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో వేలాది మంది ఉద్యోగాలు సాధించారన్నారు. తెలుగు, ఇంగ్లిషు మీడియంలలో నేటి(సోమవారం)నుంచే కొత్త బ్యాచ్‌లను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 8985094499 నంబరులో సంప్రదించి అడ్మిషన్ పొందవచ్చునని సూచించారు. హైదరాబాద్‌కు రాలేని ప్రైవేటు ఉద్యోగులు, గృహిణుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఆర్.సీ ఎగ్జామ్ యాప్ ద్వారా తెలుగు, ఇంగ్లిషు మీడియంలో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సాక్షి యాడ్స్ మేనేజర్ చంద్రశేఖర్, ఈవెంట్ మేనేజర్ చంద్ర తదితరులు మాట్లాడారు.


సదస్సుకు హాజరైన యువతీ యువకులు

సైన్స్ అండ్ టెక్నాలజీ కీలకం



ఏపీపీఎస్సీ మూడు నెలల క్రితమే గ్రూప్స్ సిలబస్‌లో మార్పులు చేసింది. ఇందులో సైన్స్ అండ్ టెక్నాలజీ అనేది చాలా కీలకం. దీనిని కరెంట్ అఫైర్స్‌లో భాగంగానే పరిగణించాలి. ఇస్రో పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలు, ఉపగ్రహ ప్రయోగాలు వంటి వాటిపై దృష్టి పెట్టాలి. ఇందులో ఏయే టాపిక్ నుంచి ఎన్ని మార్కులు వస్తాయో కూడా అవగాహన ఉండాలి.
– సి.హరిక్రిష్ణ, సైన్స్ అండ్ టెక్నాలజీ ఫ్యాకల్టీ

అన్ని అంశాలపై అవగాహన ఉండాలి



గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధం అయ్యేవారు మొదటగా సిలబస్‌పై అవగాహన పెంచుకోవాలి. మెంటల్ ఏబిలిటీ అనేది అర్థం చేసుకుని చదవాలి. పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యే వారు అందరిలాగా కాకుండా విభిన్నంగా ఆలోచించాలి. – శంకర్‌రెడ్డి, మెంటల్ ఏబిలిటీ

సమయం ప్రధానం



సివిల్స్, గ్రూప్స్ వంటి పరీక్షలకు సన్నద్ధం అవుతున్న వారు చక్కని ప్రణాళిక వేసుకుంటేనే విజయం సులువు అవుతుంది. పోటీ పరీక్షలకు సమయం అనేది చాలా కీలకం. ఎకానమీ అనేది గతం, వర్తమానంతో పాటు, కరెంట్ అంశాలను గూగుల్‌లో ఎప్పటికప్పుడు చూస్తుండాలి. నోటిఫికేషన్ కోసం ఎదురుచూడకుండా ఆలోపు నిర్దేశిత సిలబస్ మేరకు ప్రిపరేషన్ మొదలు పెట్టి పూర్తి చేయాలి. నోటిఫికేషన్ వచ్చాక కేవలం క్లిష్టతర అంశాలను ఎక్కువగా దృష్టి పెట్టాలి. – ఎం.డి పాషా, ఎకానమీ ఫ్యాకల్టీ

విభిన్న ఆలోచనలతో సన్నద్ధం కావాలి



పోటీ పరీక్షలకు లక్షల మంది దరఖాస్తు చేస్తారు. అందులో తక్కువ మంది మాత్రమే గ్రూప్స్ సిలబస్ గురించి అవగాహన ఉంటుంది. ఇందులో అంశాల పరిధిని చాలా విస్తృతంగా చదవాలి. ప్రశ్నల సరళిలో చాలా మార్పులు చేశారు. ప్రతి అంశంపై చాలా లోతుగా ఆలోచనలు చేసి, విభిన్నంగా సన్నద్ధం కావాలి.
– బి.కృష్ణారెడ్డి, పాలిటీ, ఫ్యాకల్టీ

భవిష్యత్తుకు భరోసా



నేను సివిల్స్ రాసి ఇంటర్వ్యూ వరకు వెళ్లొచ్చాను. గ్రూప్–1 ఉద్యోగం సాధించి రిజిస్ట్రేషన్ శాఖలో పని చేశాను. అయితే టీచింగ్‌పై ఉండే మక్కువతో మూడు దశబ్దాలుగా హిస్టరీ బోధకుడిగా పని చేస్తున్నాను. తెలంగాణ, ఢిల్లీ, బెంగళూరు, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లోను వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చాను. కోవిడ్ సమయంలో పోటీ పరీక్షల కోసం ఆన్‌లైన్ తరగతులు ప్రారంభించాం. ఆర్.సీ ఎగ్జామ్ సెంటర్ పేరుతో సంస్థను ఏర్పాటు చేసి వేలాది సబ్జెక్టు వీడియోలు యాప్‌లో అప్‌లోడ్ చేశాం. యూపీఎస్సీ స్థాయిలో మేం కోచింగ్ ఇస్తున్నాం. జిల్లావాసిగా ఈ ప్రాంత నిరుద్యోగులకు మేలు చేయాలనే ఉంది. – డాక్టర్ ఎం. అబ్దుల్ కరీం, హిస్టరీ ఫ్యాకల్టీ

స్ఫూర్తిని కలిగించారు



గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలపై అవగాహన కార్యక్రమానికి మొదటిసారి హాజరయ్యాను. ఈ సదస్సు ద్వారా చాలా మందిలో స్ఫూర్తి నింపారు. పోటీ పరీక్షల్లో రాణించాలంటే ముందుగా ఆత్మస్థైర్యం అనేది కీలకం. పరీక్షల సన్నద్ధత, సిలబస్ తదితర అంశాలపై ఫ్యాకల్టీ వివరించిన తీరు ఆకట్టుకుంది. – మహేశ్వరి

చక్కని మార్గనిర్దేశం



గతంలో చాలా పోటీ పరీక్షలకు హాజరయ్యాను. గ్రూప్స్ పరీక్షలు అంటేనే చాలా పోటీ ఉంటుంది. ఈ పోటీలో విజయం సాధించాలంటే అభ్యర్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఫ్యాకల్టీ చాలా చక్కగా వివరించారు. పోటీ పరీక్షలకు తొలిసారి సన్నద్ధం అయ్యేవారు సైతం తక్కువ సమయంలో ఎలా విజయం సాధించాలి, ప్రణాళిక ఏ విధంగా తయారు చేసుకోవాలి అనేదానిపై స్పష్టత వచ్చింది. – రాఘవేంద్ర, సచివాలయం ఉద్యోగి

కాకినాడ నుంచి వచ్చాను



గ్రూప్–2 పరీక్షలపై అభ్యర్థులకు ఉచితంగా అవగాహన కల్పిస్తున్నారని పేపర్‌లో చూశాను. అందుకే కాకినాడ నుంచి అవగాహన సదస్సు కోసం వచ్చాను. ఆర్‌సీ ఎగ్జామ్ సంస్థ ఏర్పాటు చేసిన ఆఫ్‌లైన్ తరగతుల అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే కచ్చితంగా గ్రూప్–2 ఉద్యోగం సాధిస్తామనే నమ్మకం కలిగింది. వారు నిర్వహించిన స్కాలర్‌షిప్ పరీక్షలో రెండో విజేతగా నిలవడం చాలా సంతోషంగా ఉంది. – జి.వరప్రసాద్, కాకినాడ, సచివాలయ ఉద్యోగి

గ్రూప్–2పై మంచి అవగాహన



గ్రూప్–2 పరీక్షలపై నిరుద్యోగ అభ్యర్థులకు మంచి అవగాహన కల్పించారు. ఆర్‌సీ ఎగ్జామ్ సంస్థ, సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సు చాలా చక్కగా ఉంది. టీచింగ్ ఫ్యాకల్టీ పరీక్షల సన్నద్ధతపై మంచి అవగాహన కల్పించారు.
– బి.ఎస్ చౌదరి, నంద్యాల

24 వరకు ఒంటి పూట బడులు

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్రంలో వేసవి ఉష్ణోగ్రతలు కొనసాగుతున్న కారణంగా ఒంటిపూట బడులను ఈ నెల 24వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష కమిషనర్ ఎస్. సురేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7:30 నుంచి 11:30 తరగతులు నిర్వహించాలని సూచించారు.




కూల్..కూల్‌గా.. ట్రాఫిక్‌లో విధులు!

జూన్ నెల ముగుస్తున్నా భానుడు తన ప్రతాపాన్ని తగ్గించుకోలేదు. పగటిపూట ఎండలు మండిపోతున్నాయి. భారీగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. మధ్యాహ్న సమయంలో రోడ్ల మీదకు వచ్చేందుకు జంకుతున్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ట్రాఫిక్ కానిస్టేబుళ్లు హాయిగా విధులు నిర్వర్తించడం కోసం పోలీస్ శాఖ ఏసీ హెల్మెట్లను అందజేసింది. వీటి తలపై ఉంచుకుని కూల్..కూల్‌గా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు. – సాక్షిఫొటో గ్రాఫర్, కర్నూలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన ఆటో


కోడుమూరు రూరల్: కోడుమూరు – కర్నూలు రహదారిలో ప్యాలకుర్తి సమీపంలో లారీ.. ఆటోను ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గోనెగండ్లకు చెందిన వీరపోగు భాస్కర్ (45) భార్య నర్సమ్మ, అల్లుడు సురేంద్రతో కలిసి ఆదివారం కర్నూలుకు ఆటోలో వెళుతుండగా, కర్నూలు నుంచి కోడుమూరు వైపు వస్తున్న లారీ ప్యాలకుర్తి గ్రామ సమీపంలో వేగంగా ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం 108 వాహనంలో వైద్య సిబ్బంది కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ వీరపోగు భాస్కర్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలాన్ని చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈ సారు.. మా కొద్దు!

పత్తికొండ రూరల్: ఆ ఉపాధ్యాయుడు ఉంటే తమ పిల్లలను బడికి పంపించలేమని హోసూరు గ్రామానికి చెందిన కొందరు తల్లిదండ్రులు జెడ్పీ పాఠశాల హెచ్ఎం గాజుల రమేష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయం ఆదివారం ఆలస్యంగా వెలుగుచూసింది. పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కేవీ రమణ విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ విషయాన్ని మండల, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని, స్థానికంగా ఉండే పీఎంసీ కమిటీతో చర్చించి ఏం చేయాలో ఆలోచిస్తామని తల్లిదండ్రులకు హెచ్ఎం సమాధానమిచ్చారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న కేవీ రమణ గతంలో పుచ్చకాయలమాడ జెడ్పీ స్కూల్‌లో కూడా విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు విద్యార్థినుల తల్లిదండ్రులు ఆరోపించారు.



ఇదే కదా తల్లి ప్రేమ



మేతకు అడవికి వెళ్లిన ఆవు.. పులి కంట బడటం.. ఒకసారి అవకాశం ఇస్తే ఇంటి వద్ద ఉన్న లేగ దూడకు పాలిచ్చి తోటి పశువులకు అప్పగిస్తానని వేడుకోవడం, అందుకు పులి ఒప్పుకోవడం.. చెప్పినట్లుగానే ఆవు ఇంటికెళ్లి తిరిగి రావడం.. ఆవు నిజాయితీని చూసి పులి చంపకుండా వదిలేయడం.. ఈ కథ అందరూ చదివే ఉంటారు. ఈ కథలో నిజాయితీతో పాటు తల్లి ఆవు మమకారం కూడా కనిపిస్తోంది. ఈ కథ ఇప్పుడెందుకంటరా.. తల్లి మమకారానికి నిదర్శనంగా కోవెలకుంట్ల పట్టణంలో ఓ ఘటన చోటు చేసుకుంది. స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలో ప్రధాన రహదారిపై ఆదివారం ఉదయం మేతకు వెళ్లిన ఆవు తిరిగి వస్తుండగా కోడెదూడ ఆకలితో ఎదురెళ్లింది. వాహనాలు వస్తున్నా పక్కకు కదలకుండా అలాగే నిలబడి కోడెదూడకు పాలిచ్చి ఆకలి తీర్చింది. పది నిమిషాల పాటు ఆవు పాలిస్తుండగా వాహన చోదకులు కూడా అంతరాయం కలిగించకుండా వాహనాలను పక్కకు తిప్పుకుని వెళ్లారు. ఈ దృశ్యాన్ని చూసిన పలువురు 'ఇదే కదా తల్లి ప్రేమ' అంటూ చర్చించుకున్నారు.
– కోవెలకుంట్ల